క్లుప్తంగా

గోరంట్ల మాధవుడికి కుడా చైర్మన్ పూజలు



శ్రీలక్ష్మీమాధవుడికి పూజలు నిర్వహిస్తున్న కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి

కోడుమూరు రూరల్: మండలంలోని గోరంట్లలో వెలసిన శ్రీలక్ష్మీమాధవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి స్వామి అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థాన అధికారులు, స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు కుడా చైర్మన్‌కు ఘనంగా స్వాగతం పలికారు. కోట్ల హర్ష వెంట కోడుమూరు జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, రవికుమార్ రెడ్డి తదితరులున్నారు.

గడివేముల పీహెచ్‌సీ తనిఖీ



పీహెచ్‌సీలో సిబ్బందికి సూచనలు ఇస్తున్న జిల్లా అధికారి డాక్టర్ చంద్రశేఖర్

గడివేముల: చిన్నారుల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని నంద్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఏఓ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రం గడివేములలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి పరిసరాలను, రికార్డులను పరిశీలించారు. అనంతరం జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమంలో పాల్గొన్నారు. 1 నుంచి 19 ఏళ్ల పిల్లలకు నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ప్రజలకు తెలియజేయాలని సిబ్బందికి ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో డాక్టర్ తేజస్విని, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం రిజర్వేషన్లు



ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో మాట్లాడుతున్న ఎంఈఓ కోటయ్య

పాణ్యం: మండలంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి 25 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఎంఈఓ కోటయ్య తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి ప్రైవేట్ పాఠశాలలో 1వ తరగతిలో చేరేందుకు ఈ నెల 18 నుంచి వచ్చే నెల 7వ తేదీ వరకు ఆసక్తి కలిగిన పిల్లల తల్లిదండ్రులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకునే సమయంలో ఆయా పాఠశాలల పేర్లు ఉంటాయన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనాథలు, హెచ్‌ఐవీ విద్యార్థులకు 5 శాతం రిజర్వేషన్, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, గ్రామీణ ప్రాంతంలో రూ.1.20 లక్షల వార్షిక ఆదాయం, పట్టణాల్లో రూ.1.44 లక్షల ఆదాయం ఉన్న బీసీ, మైనార్టీ కుటుంబాలకు 6 శాతం చొప్పున ప్రభుత్వం సీట్లు కేటాయించినట్లు తెలిపారు. ఈ నిబంధనలను ప్రతి పాఠశాలలో యాజమాన్యాలు అమలు చేయాలన్నారు. పిల్లల తల్లిదండ్రులు పూర్తి వివరాలకు ఎంఈఓ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

23న బండలాగుడు పోటీలు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఈ నెల 23వ తేదీన రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని న్యూ కేటగిరీ వృషభాలకు పోటీలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. విజేతలుగా నిలిచిన వృషభాల యజమానులకు వరుసగా రూ.70 వేలు, రూ.60 వేలు, రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల చొప్పున బహుమతులు అందజేస్తామని చెప్పారు. పోటీల్లో పాల్గొనే వృషభాల యజమానులు రూ.600లు ఎంట్రీ ఫీజు చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు 94932 52765, 89850 29585, 94406 16377 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

స్కిల్ డెవలప్‌మెంట్‌పై అవగాహన

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న ఏపీ గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో మంగళవారం శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో 'స్కిల్ ఫర్ బెటర్ కమ్యూనికేషన్' అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం మాట్లాడుతూ పాఠశాలలోని విద్యార్థులకు సాంకేతిక విద్య, స్కిల్ డెవలప్‌మెంట్ ఏ విధంగా అభివృద్ధి చేసుకోవాలనే అంశంపై వివరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇల కైలాసం..భక్తి ప్రవాహం

- శ్రీశైలంకు కాలినడకన కన్నడిగులు
- ఎర్రని ఎండలను లెక్కచేయకుండా..
- ఉగాది బ్రహ్మోత్సవాల్లో భ్రమరాంబకు సారె సమర్పించడానికి తరలివెళ్తున్న భక్త జనం
- మండల వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు



మల్లికార్జునుడి రథంను లాగుతున్న బాగల్‌కోట్ ప్రాంత భక్తులు

సి బెళగల్: శ్రీశైలంలో ఉగాది బ్రహ్మోత్సవాల కోసం కన్నడిగులు పాదయాత్రగా తరలివస్తున్నారు. మండుటెండల్ని లెక్కచేయకుండా వందల కి.మీ దూరం నుంచి కాలినడకన బయలు దేరారు. తమ ఇంటి ఆడపడుచుగా భావించే భ్రమరాంబ అమ్మవారికి ఉగాది పర్వదినం రోజున సారెను సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. కర్ణాటక రాష్ట్రంలోని హోస్పేట్, మాన్వి, రాయచూర్, గదక్, బళ్లారి, బాజు, జమ్ముకొండి, కొన్నూర్, హుబ్లీ తదితర ప్రాంతాల నుంచి గత ఆదివారం రోజు నుంచి పాదయాత్రలు మొదలయ్యాయి. ఇలకై లాసం అయిన శ్రీగిరి వైపు భక్తులు ప్రవాహం వలే సాగుతున్నారు. కర్ణాటక నుంచే కాకుండా మహారాష్ట్ర, కేరళ రాష్ట్రాలలోని కొన్ని ప్రాంతాల నుంచి కూడా భక్తులు కాలినడకన రావటం విశేషం.

దారి పొడవునా సేవా కార్యక్రమాలు :
సుదూర ప్రాంతాల నుంచి శ్రీశైలంకు పాదయాత్రగా వెళ్తున్న కన్నడిగుల కోసం దారి పొడవునా ప్రజలు వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టారు. మంగళవారం సి.బెళగల్ మండలంకు చేరుకున్న భక్తులకు ఆయా గ్రామాల ప్రజలు, యువకులు అన్నదాన, విశ్రాంతి కోసం వసతి, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించారు. సి బెళగల్‌తో పాటు పోలకల్, బురాన్‌దొడ్డి, కంబదహాల్, కొండాపురం, సంగాల, కొత్తకోట, గుండ్రేవుల గ్రామాలలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. అడుగడుగునా తాగునీరు, మజ్జిగా, నిమ్మరసం, చిరుతిళ్లు, ఉచిత వైద్య సేవలు, మందుల పంపిణీ వంటివి ఆయా గ్రామాల ప్రజలు, గ్రామ పెద్దలు, దాతలు సమకూర్చుతున్నారు. ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు డేరలు, చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా మహిళలు, బాలికలు స్నానం చేయడానికి డేరాలలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉచిత వైద్య శిబిరాలతోపాటు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు ఉన్న గ్రామాల్లో ఆరోగ్య కార్యకర్తలచే పీహెచ్‌సీల వైద్యాధికారులు ప్రతాప్, హరిచంద్రుడు, సునీత్ మిథున్‌రెడ్డి వైద్య సదుపాయాలు కల్పిస్తున్నారు.



20 కేజీల బియ్యం బస్తాను భుజాలపై మోస్తూ...

మొక్కులో వైవిద్యం :
ఎర్రని ఎండలను లెక్క చేయని భక్తులు శ్రీశైల మల్లికార్జున, భ్రమరాంబ దేవికి మొక్కులను చెల్లించటంలో వైవిద్యం ప్రదర్శిస్తారు. ఇందులో చాలా మంది భక్తులు భుజాన స్వామి వారి ప్రతిమలను నియమనిష్టలతో మోసుకొని పాదయాత్రగా వస్తారు. కొంత మంది నంది (ఎద్దులను), అశ్వం (గుర్రా)లపై దేవతా మూర్తులను తీసుకువస్తే... మరికొందరు కఠోరంగా కాలు కింద పెట్టకుండా కాళ్లకు చెక్కలను కట్టుకుని భుజాలపై 20 నుంచి 25 కిలలో బరువు ఉండే బియ్యం బస్తాలను (మొక్కుబడులను) వేల కిలో మీటర్ల నుంచి తీసుకురావడం విశేషం. కొంతమంది శ్రీ మల్లికార్జున స్వామి వారి రథంను లాగుతూ పాదయాత్రగా శ్రీశైలంకు సాగుతుంటారు.



కాళ్లకు కట్టెలు కట్టుకుని పాదయాత్ర సాగిస్తున్న బెల్గాం జిల్లా కన్నడ భక్తులు



పోలకల్ ఎత్తిపోతల పథకం కాలవ దగ్గర సేదతీరుతున్న పాదయాత్రీకులు



స్వామి వారి కంచి (కాడి)ని భుజాలపై మోస్తూ ముందుకు సాగుతున్న మహిళా భక్తురాలు

16న వేలం పాటలు

గడివేముల: మండల కేంద్రమైన గడివేములలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారి జాతర సందర్భంగా తలనీలాలు ప్రోగు చేసుకునేందుకు ఈ నెల 16వ తేదీన ఆలయ ప్రాంగణంలో బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఈఓ మోహన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు రూ.10 వేలు డిపాజిట్ చేసి వేలం పాడాలన్నారు. ఈ నెల 23 నుంచి ఏప్రిల్ 24వ తేదీ వరకు మాత్రమే తలనీలాలు ప్రోగు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు వేలం పాటలో పాల్గొనాలన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

సి.బెళగల్: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం(నేడు) ఎంపీపీ బొంతల మునెప్ప అధ్యక్షన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాముడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి అన్ని శాఖల అధికారులు తమ శాఖలకు చెందిన ఆరు సెట్ల రిపోర్టులు, నివేదికలతో హాజరుకావాలన్నారు. హాజరు కాని అధికారులపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదించటం జరుతుందన్నారు.

భక్తులకు అన్నదానం

గూడూరు: శ్రీశైలంకు కాలినడకన వెళ్తున్న కర్ణాటక భక్తులకు గూడూరులో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఎల్.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం కొనసాగింది. వందలాది మంది కన్నడిగులు భోజనం చేసి కాసేపు శిబిరంలో సేద తీరి అనంతరం ముందుకు కదిలారు. రహదారుల పొడవునా శివనామ స్మరణ మార్మోగుతోంది.

కనులపండువగా శ్రీలక్ష్మీమాధవుడి రథోత్సవం

- గోవింద నామస్మరణతో మార్మోగిన గోరంట్ల

కోడుమూరు రూరల్: కోడుమూరు మండలం గోరంట్లలో వెలసిన శ్రీలక్ష్మీమాధవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం అశేష జనవాహిని మధ్య స్వామి రథోత్సవ కార్యక్రమం కనుల పండువగా సాగింది. జిల్లా నలుమూలల నుంచే గాకా కర్ణాటక, అనంతపురం, తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి వేలాదిమంది భక్తులు తరలివచ్చి రథోత్సవాన్ని తిలకించారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, మేళతాళాలతో శ్రీలక్ష్మీ, భూదేవి మాధవస్వాముల విగ్రహాలను రథంపై ఆశీనులను చేయగా, భక్తుల గోవిందనామస్మరణ మధ్య రథోత్సవ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అవాంఛనీయ సంఘటన జరుగకుండా కోడుమూరు సీఐ శ్రీధర్ ఆధ్వర్యంలో కోడుమూరు, గూడూరు, సి.బెళగల్ మండలాల ఎస్‌ఐలు, సిబ్బంది గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు.

హిందూపురం ఎంపీ పూజలు :
శ్రీలక్ష్మీమాధవస్వామి రథోత్సవాన్ని పురస్కరించుకొని హిందూపురం పార్లమెంట్‌సభ్యులు గోరంట్ల మాధవ్ దంపతులు స్వామి అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఆలయ అధికారులు, స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు స్వాగతం పలికారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచు బాలక్రిష్ణ, ఆలయ కమిటీ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



అశేషజనవాహిని మధ్య సాగుతున్న శ్రీలక్ష్మీమాధవస్వామి రథోత్సవం

ముడుమాలలో ఇరువర్గాల ఘర్షణ

- మూడు బైక్‌లు దగ్ధం

సి.బెళగల్: మండల పరిధిలోని ముడుమాల గ్రామంలో గొర్రెల మంద మేత విషయంలో జరిగిన ఇరువర్గాల ఘర్షణలో మూడు బైక్‌లు దగ్ధం అయ్యాయి. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలాగున్నాయి. గ్రామానికి చెందిన అన్నదమ్ములు కర్రెన్న, చిన్న వెంకటరెడ్డి, గడ్డం వెంకటేష్‌లు. వీరిలో ఒక్కొక్కరికి ముగ్గురు కుమారులు సంతానంగా ఉన్నారు. కర్రెన్న కుమారులు తిమ్మప్ప, సోమనాయుడు, భీమ నాయుడు, చిన్న వెంకటరెడ్డి కుమారులు ఈరన్న, తిమ్మప్ప, చిన్న తిమ్మప్ప, గడ్డం వెంకటేష్ కుమారులు రామంజనేయులు, తిమ్మప్ప, లక్ష్మన్నలు ఉన్నారు. వీరు ఆస్తులు, పొలం గట్లు, వ్యవసాయ బావి సాగునీటి పంపకాలు, గొర్రెల మంద మేపు విషయంలో గత కొంతకాలంగా తరచూ ఘర్షణపడుతున్నారు. ఇందులో భాగంగానే గత వారం కర్రెన్న కుమారులు సోమనాయుడు, తిమ్మప్పలపై పొలం రస్తా, గొర్రెల గడ్డి మేపు కోసం చిన్న వెంకటరెడ్డి, గడ్డం వెంకటేష్ కుమారులు దాడి చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి రెండు వర్గాలకు చెందిన వారు మళ్లీ గొడవపడ్డారు. ఈ క్రమంలో చిన్న వెంకటరెడ్డి, గడ్డం వెంకటేష్‌ల కుమారులకు చెందిన మూడు బైక్‌లను కర్రెన్న కుమారులు తగలబెట్టారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ పీరయ్య పోలీస్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్‌ఐ తెలిపారు.



సంఘటన స్థలంలో స్థానికులను విచారిస్తున్న ఎస్‌ఐ పీరయ్య

రోడ్డు ప్రమాదంలో బావబామర్దులు మృతి

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం వెంకాయపల్లె రోడ్డులోని ఎస్‌ఎస్ గార్డెన్ ఎదురుగా మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో నందికొట్కూరు నియోజకవర్గ పరిధిలోని కొణిదెల గ్రామానికి చెందిన తోడేలు మల్లికార్జున (30), పులి వెంకటేశ్వర్లు (28) ఇద్దరు మృతి చెందారు. కొణిదెల గ్రామానికి చెందిన పాండు కుమారుడు మల్లికార్జున బట్టల షాపులో గుమస్తాగా పనిచేసేవాడు. అదే గ్రామానికి చెందిన పెండయ్య కుమారుడు వెంకటేశ్వర్లు జేసీబీ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. వీరివురు వరుసకు బావాబామర్దులు. బంధువులు వెంకాయపల్లె ఎల్లమ్మతల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేస్తుండడంతో హాజరయ్యారు. అనంతరం కొణిదెలకు తిరిగి వెళ్తుండగా ఐషర్ వాహనాన్ని ఢీకొట్టారు. గాయపడిన వీరివురిని కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందారు. తోడేలు మల్లికార్జునకు భార్య, ఓ కుమారుడు సంతానం. పులి వెంకటేశ్వర్లుకు భార్య, కుమారుడు, కుమార్తె సంతానం. సంఘటన స్థలానికి చేరుకున్న కర్నూలు అర్బన్ తాలుకా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.





రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తోడేలు వెంకటేశ్వర్లు,పులి వెంకటేశ్వర్లు

మానసిక ఒత్తిడికి గురికాకూడదు

ఓర్వకల్లు: పరీక్షా సమయంలో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకూడదని విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్యాముల్ పాల్ అన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీహెచ్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు ఏడీ పాల్‌తో పాటు రాయలసీయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ వెంకట సుందరానంద్ పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారపు అలవాట్లపై అవగాహన సదస్సు నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో వారు మాట్లాడుతూ.. పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ముఖ్యంగా ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. పరీక్షలు దగ్గర పడేకొద్దీ మానసికంగా ఆందోళన చెందకూడదన్నారు. బట్టి కొట్టే పద్ధతికి స్వస్తి పలకాలన్నారు. రాత్రిపూట కాకుండా వేకువ జాము చదువుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వేసవి కాలంలో శీతల పానీయాల కంటే కొబ్బరినీళ్లు, గ్లూకోజ్, మజ్జిగ వంటివి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సీఆర్‌పీ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



పదో తరగతి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సి.బెళగల్: ఇంటర్ పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులు ఒత్తిడి లేకుండా పరీక్షలను రాయాలని సి.బెళగల్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ బలరాముడు అన్నారు. మంగళవారం కళాశాలలో ఇంటర్ మీడియెట్ విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల హాల్‌టికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పీఈటీ రవి, ఉపాధ్యాయులు ఉన్నారు. అదేవిధంగా స్థానిక మోడల్ స్కూల్లో ఫస్ట్ ఇయర్ 86 మంది, సెకండ్ ఇయర్ 94 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ వంశీమోహన్ తెలిపారు. కాగా ఈ సంవత్సరం ఇంటర్ మీడియెట్ మొదటి సంవత్సరం ప్రారంభమైన సి.బెళగల్ కస్తూరిబా బాలికల విద్యాలయంలో 26 మంది బైపీసీ బాలికలు నేడు పరీక్షలు రాయనున్న పాఠశాల ఎస్‌ఓ జ్యోతి తెలిపారు.

పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

- నులిపురుగుల నివారణకు మాత్రల పంపిణీ

కోడుమూరు రూరల్/పాణ్యం/సి.బెళగల్: పిల్లల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులతో పాటు వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ సూచించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం కోడుమూరు మండలంలోని అమడగుంట్ల హైస్కూల్ విద్యార్థులకు లద్దగిరి పీహెచ్‌సీ వైద్యాధికారిణి డా.నస్రీమ్ ఆధ్వర్యంలో ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన డాక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. నులిపురుగుల నివారణతోనే చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని, అప్పుడే చక్కగా చదువుకుంటారన్నారు. కార్యక్రమంలో లద్దగిరి పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్‌యాదవ్, సీహెచ్‌ఓ శాంత తదితరులు పాల్గొన్నారు. పాణ్యం మండలంలోని పలు పాఠశాలల్లో ఎంఈఓ కోటయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ దస్తగిరి మాట్లాడుతూ.. మండలంలో మొత్తం 11,871 మంది విద్యార్థులు ఉండగా మొదటి రోజు 10,903 మందికి మాత్రలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మద్దూరు పీహెచ్‌సీ డాక్టర్ భగవాన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు. సి.బెళగల్ మండలంలో ఎంపీడీఓ రాముడు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వంశీమోహన్, సి.బెళగల్ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది విద్యార్థులకు మాత్రలను పంపిణీ చేశారు.



పాణ్యంలోని అయ్యపురెడ్డి కాలనీ ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఎంపీడీఓ

కల్లూరు/కర్నూలు (న్యూటౌన్): కల్లూరులోని ప్రాథమిక మండల పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు ఎంఈఓ శ్రీనివాసులు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులిపురుగులను నులిపేద్దామని అన్నారు. పిల్లలు, కిశోర బాలల కడుపులో నులి పురుగులు ఉన్నట్లయితే పోషకాహార లోపం, రక్తహీనత, శారీరక, మానసిక ఎదుగుదల లోపాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు. కర్నూలు మండలం మిలిటరీ కాలనీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్ డాక్టర్ నిర్మలమ్మ మాట్లాడుతూ ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఆల్బెండజోల్ 400 ఎంజీ మాత్రను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయమ్మ, ఏఎన్‌ఎం అనిత, ఆశా వర్కర్ వరాలు తదితరులు పాల్గొన్నారు.



నులిపురుగుల నివారణ మాత్రలను విద్యార్థినికి వేస్తున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్



అల్బెండజోల్ మాత్రను విద్యార్థిని నోట్లో వేస్తున్న ఎంఈఓ శ్రీనివాసులు

కోలుకోలేక వ్యక్తి మృతి

కల్లూరు: కోడుమూరు మండలం లద్దగిరి గ్రామానికి చెందిన రవికుమార్(25) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. ఈ నెల 10వ తేదీన లద్దగిరి నుంచి కర్నూలుకు బైక్‌పై బోయ లోకేష్, బోయ రవికుమార్ వస్తుండగా మార్గమధ్యంలో కొత్తూరు దేవాలయం దగ్గర అతివేగం, అజాగ్రత్తతో ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టారు. ఈ సంఘటనలో గాయాలపాలైన రవికుమార్‌ను చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. కాగా మృతునికి భార్య సుజాత, కుమారుడు ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు బోయ లోకేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఏఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

వెండి కిరీటం బహూకరణ

గూడూరు రూరల్: మండల పరిధిలోని కె.నాగలాపురంలో సుంకులపరమేశ్వరీదేవికి లద్దగిరికి చెందిన భక్తులు మంగళవారం వెండి కిరీటాన్ని బహూకరించాడు. అమ్మవారి మొక్కులో భాగంగా పెద్ద సుంకన్న, శ్రీనివాసులు కలిసి 725 గ్రాముల వెండితో కిరీటాన్ని తయారు చేసి దేవాలయ అధికారులకు అందించారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించి అమ్మవారి ప్రసాదాన్ని అందించినట్లు ఆలయ అధికారి దినేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ప్లానింగ్ కార్యదర్శి మృతి



మృతి చెందిన టి.స్ఫూర్తి(ఫైల్)

కర్నూలు (టౌన్): కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలోని 9వ వార్డు 23వ సచివాలయంలో ప్లానింగ్ కార్యదర్శిగా పని చేస్తున్న టి.స్ఫూర్తి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందింది. ఈ సంఘటన సోమవారం ఉదయం హైదరబాద్‌లో జరిగింది. నగరంలోని విష్ణు టౌన్‌షిప్‌లో నివాసం ఉండే ఆమెకు ఈ ఏడాది జనవరి 27వ తేదీన వివాహం అయ్యింది. భర్త హైదరబాద్‌లో పనిచేస్తున్నాడు. ఆదివారం మృతురాలికి పరీక్ష ఉండటంతో అక్కడికి వెళ్లింది. పరీక్ష ముగించుకొని సోమవారం ఉదయం తిరిగి కర్నూలుకు రావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఉదయం భర్తతో కలిసి ద్విచక్రవాహనంలో హైదరాబాద్‌లోని మెట్రో స్టేషన్‌కు వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన బస్సు వీరి వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. భర్త తీవ్ర గాయాలతో హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన హైదరబాద్‌కు వెళ్లి కూతురు మృతదేహాన్ని కర్నూలులోని స్వగృహానికి తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న నగరపాలక టౌన్ ప్లానింగ్ అధికారులు హయ్యత్, రంగస్వామి, తోటి ఉద్యోగులు, మున్సిపల్ సిబ్బంది మంగళవారం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

రక్తహీనతపై అప్రమత్తంగా ఉండాలి

కర్నూలు(హాస్పిటల్): గర్భిణులు రక్తహీనత పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్‌ఈఈవో నిర్మలమ్మ చెప్పారు. మంగళవారం ఆమె కర్నూలు మండలంలోని భూపాల్‌నగర్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గర్భిణులతో మాట్లాడుతూ గర్భవతిగా ఉన్న సమయంలో రక్తహీనత లేకుండా చూసుకోవాలన్నారు. ఈ మేరకు ఏఎన్‌ఎంల సహాయంతో అవసరమైన పరీక్షలు నిర్వహించుకుని, రక్తహీనత ఉంటే తప్పనిసరిగా ఐరన్ మాత్రలు వాడాలని సూచించారు. ఆమె వెంట హెల్త్ సూపర్‌వైజర్ సంపత్‌కుమార్, సచివాలయ ఏఎన్‌ఎం టి.అనిత, లక్ష్మీదేవి తదితరులు ఉన్నారు.



గర్భిణికి సూచనలు ఇస్తున్న హెచ్‌ఈఈవో నిర్మలమ్మ